

**పి.వి.ఆర్.శివకుమార్**

"గజకర్ణంగారికి బేడీలు ప ాయిట!"

"ఉన్నట్టుండి మెరుపుదాడి జరిపి, రెడ్ హేండెడ్‌గా పట్టుకున్నారట స్పెషల్ స్క్వాడ్!"

"అయ్యబాబోయ్! గజకర్ణంగారి మీదే దాడి జరిపెయ్యగల ఆచూకీ, సామర్థ్యం ఎలా చిక్కాయో వాళ్ళకి!"

"అదే విడ్డూరం. ఏ న సూర్యమే ఆయనమీద రహస్యంగా ుపోర్టిచ్చి మరీ పట్టించాట్ట!"

అట్టుడికినట్టుడికి పోయింది కాలేజీ అంతా యీ వార్తతో. కాలేజీయే కాదు, నగరం నగరమే ఉడికిపోయింది గజకర్ణం గారి అరెస్టు వార్త విని!

అవును- గజకర్ణంగారు మామూలు మనిషికాదు- లక్షాధికారి. ఇంకా చెప్పాలంటే కోటీశ్వరుడు!

ఆయన ఎన్ని వేల వ్యాపారాలుచేసి,ఎన్ని లక్షల జీవాల ఉసురు పోగుచేసి, అన్ని కోట్లకి పడగలెత్తాడో ఆ నగరంలో ప్రతి వాడికీ తెల్సు!

ఎన్ని వేల వ్యాపారాల్లోనూ ఎన్నిలక్షల అన్యాయాలున్నాయో అన్ని కోట్లమందికీ తెలుసు!

అయితే, తెలిసిందల్లా చూపినవాళ్ళూ లేరు- చూపిందంతా చెప్పేవాళ్ళూ లేరు! అందుకే ఆయన కోట్లకి ఒక్కనాడూ చిరుగు పట్టలేదు.

ఎందరు సిన్సియర్ ఆఫీసర్లు- ఎన్ని రకాలుగా ప్రయత్నించినా,ఆయన వారందరి సిన్సియారిటీకి తగిన రేట్లు వెచ్చించి కొనేయగలిగాడు ఇన్నాళ్ళూ. తన ఉనికికి భంగం రాకుండా కాపాడుకోగలిగాడు ఇన్నేళ్ళూ!

నిజం చెప్పాలంటే, ఒకో ఇన్వెస్టిగేషన్ జరిగి- తప్పిపోయినప్పుడల్లా- ఆయన ఉనికిని మరింత పటిష్ఠంచేసుకుని, మబ్బు విడిచిన సూర్యుడిలా మరింత వెలిగిపో సాగాడు.

అలాటి మహా పర్వతం యీనాడు కూలిపోయిందంటే- ఆనందంకన్న ఆశ్చ ర్యమే అధికమైంది అందరికీ.

* * *

"తెలుగు లెక్చరర్ .... డౌన్- డౌన్!"

"లెక్చరర్ల దురాగతాలు ...నశించాలి!"

"విద్యార్థుల ఐక్యత ....వర్ధిల్లాలి!"

కాలేజీ అంతటా నినాదాలు మారుమోగు తున్నాయి. విద్యార్థులంతా క్లాసులు వదిలి బయటికి వచ్చేశారు.

పావుగంట వ్యవధిలో కాలేజీ అంతటా వ్యాపించింది. సెకండియర్ విద్యార్థులు

క్లాసుని బాయ్‌కాట్ చేసేశారన్న వార్త!

అరగంటసేపట్లో కాలేజి అంతా ఖాళీ అయిపోయింది. అందరు గ్రౌండ్‌లో సమావేశమై పోయారు.

"తెలుగు లెక్చరర్ చేత క్షమాపణ చెప్పించాలి!"

"అవును, చెప్పించాల్సిందే! లేకపోతే, నిండు క్లాసులో రిప్రజంటేటివ్‌ని అంత మాటంటాడా!"

"యస్. ఆ వాళ్ళు తిమ్మి రేమిటో తగ్గించాల్సిందే!"

"అందునా, మన చంద్రం చేసిన తప్పు ప్రశ్న వేశాడా? కేవలం సబ్జక్ట్‌మీద సందేహం అడిగాడు. చేతనైతే చెప్పాలి సమాధానం. లేదా, నోరుమూసుకు కూర్చోవాలి.

"అంతేగానీ, నోటికొచ్చింది గదా అని ఏదేదో వాగుతాడా!"

"పాఠాలమీద శ్రద్ధలేని వాజమ్మట!"

"మై గాడ్! అంత మాటన్నాడా!"

"అంతే కాదు. ఆడపిల్లల్ని గొడవ చేసే వెధవలుట!

"నాన్సెన్స్. చేస్తే మాత్రం. వాడి కూతురేం లేదుగా క్లాసులో! అయినా కాలేజీ స్టూడెంట్స్ - ఆడపిల్లల్ని కాకపోతే, అమ్మమ్మల్ని చేస్తారా గొడవ?"

"అసలు వాళ్ళని మా క్లాసులో యిప్పుడెవడు గొడవపెట్టాడు. నిజానికి! డౌట్స్ అడగటమూ గొడవ పెట్టటమే అయితే, యిహ క్లాసులకెళ్లే దెందుకు? లెసన్స్ వినే దెందుకూ?"

అందరూ కామెంట్స్ పాస్ చేస్తున్నారు.

ఇంతకీ మా క్లాసు రిప్రజెంటేటివ్ చంద్రానికి, ఆ రోజు తెలుగుక్లాసులో వచ్చిన డౌటు - 'పాలిండ్లు' - అంటే ఏమిటీ అని.

బలిచక్రవర్తి పాఠం చెప్తున్నారు లెక్చరర్. తెలుగు పొయెట్రీ క్లాస్ అది.

"సార్ పాలిండ్లంటే మిల్క్‌బూతు లేనా?" అడిగాడో విద్యార్థి.

"నో నో అవి ఆర్టిఫిషియల్. ఒరిజినల్ పాలిండ్లు అంటే, పల్లెటూళ్ళలో వుంటాయిలే - పాడి కుండలు - అవి!"

వివరించాడు మరో స్టూడెంట్.

లెక్చర్ ఆగిపోయింది ఆ రణగొణలతో.

"ఏమిటక్కడా గొడవ?" అడిగారు లెక్చరర్‌గారు.

చంద్రంలేచి, అడిగాడు.

"సార్, పాలిండ్లంటే అర్థం తెలియటం లేదు సార్! అదే మిల్క్‌బూత్‌లా, పాడికుండలా అని."

లెక్చరర్ ఒక్కసారి క్లాసంతా కలయజూశారు. మగపిల్లలు క్యూరియస్‌గా - కొంటెగా! ఆడపిల్లలు రోషంగా-సిగ్గుగా!

ఏదో తనకు తోచిన విధంగా జవాబు చెప్పారు. అది విద్యార్థుల్ని సంతృప్తి పరచలేదు. ప్రశ్నలు అధికం కాసాగాయి.

మనిషిలోని పైశాచిక ప్రవృత్తి - అదను దొరకటంతో విజృంభించింది. ప్రశ్నలు - ప్రశ్నలు! క్లాసంతా అల్లరి - గొడవ!

"సార్, ఏమిటిది? ఇలాగైతే మేం క్లాసులో కూర్చోలేము" పౌరుషంగా అంది లేడీస్ రిప్రజంటేటివ్ అరుణ.

ఒళ్లు మండిపోయింది లెక్చరర్‌కి. విద్యార్థుల్ని మందలించబోయారు. సాధ్యం కాలేదు. చంద్రం మళ్లీ లేచాడు.

"అర్థంకాని పదాల్ని వివరించలేక, మందలించటం అన్యాయం సార్! ప్లీజ్ - క్లియర్ అవర్ డౌట్ అంట్...."

"షటప్! మీకసలు చదువుమీద శ్రద్ధకన్నా, అన్య విషయాలమీద ఆసక్తి అధికంగా వుంది. పాఠాలమీద శ్రద్ధలేని వాజమ్మలు, పసలేనిప్రశ్నలు మాని బయటికి నడిస్తే, మిగతా క్లాసన్నా బాగుపడుతుంది" ఉగ్రంగా అన్నారు లెక్చరర్‌గారు.

"పాఠాలు చెప్పటం చేతకాని వాజమ్మలే బయటకు నడిస్తే. మరో లెక్చరర్ వచ్చి క్లాసుని నడిపించనన్నా వీలవుతుంది" యెవరో అరిచారు వెనకనించి.

"ఎవరా రాస్కెల్? స్టాండప్" హుంకరించారు మాష్టారు.

ఎవరూ నిలబడలేదు. మరుక్షణం అందరూ నిలబడ్డారు.

నినాదాలతో బయటకు నడిచారు.

వెంటనే ప్రారంభమైంది సమ్మె.

* * *

"మిత్రులారా! నానాటికీ లెక్చరర్ల జులుం అధికమైపోతోంది. మనమిలా చూస్తూ వూరుకుంటే, ఇంకా ఇలాగే కొనసాగిపోతుంటుంది!

ఇవేళ ఒక లెక్చరర్, ఒక క్లాసులో అన్నాడు. రేపు అందరు లెక్చరర్లూ అన్ని తరగతుల్లోనూ అనవచ్చు! దీన్ని మనం ఇవేళే అంతం చెయ్యకపోతే లాభంలేదు. మన ఫీజులమీద బ్రతుకుతూ, మనల్నే అవమానించటం, పాలుతాగుతూ రొమ్ము గుద్దటంలాటిది!

ఈ దురాగతాన్ని మనమంతా ఒక్కుమ్మడిగా అణిచితీరాలి. విద్యార్థులు కళ్ళు తెరవాలి. విప్లవించాలి. ఇటువంటి లెక్చరర్లకి బుద్ధిచెప్పాలి.

విద్యార్థి ఐక్యత....

"....వర్థిల్లాలి...." అందరూ ఒక్కుమ్మడిగా వినదించారు.

"థేంక్స్ ఫ్రెండ్స్! ఎవరన్నా మాటలాడ దల్చుకుంటే, ముందుకు రావొచ్చు" పిలుపువిచ్చాడు లీడర్.

సూర్యం లేచాడు, స్టేజీమీదికి వెళ్లాడు.

"నేను ఈ సమ్మెను వ్యతిరేకిస్తున్నాను."

అందరూ అదిరిపడ్డారు.

"వాట్?"

"యస్! ఇది న్యాయసమ్మతమయిన వ్యతిరిక్తతకాదు. సంఘ బలముంది. సంఖ్యా బలముందికదా అన్న ధైర్యంతో, బుద్ధిబలం వాడకుండా క్రమశిక్షణా రహితంగా, అక్రమంగా జరుపుతున్న ఈ సమ్మెను నేను వ్యతిరేకిస్తున్నాను."

"రేయ్! నువ్వు క్రిందికి దిగు."

"సూర్యం....డౌన్-డౌన్!"

"ఆగండి - ముందు నామాట వినండి. మనమిప్పుడు సమ్మెచెయ్యటం ఎందుకు? లెక్చరర్ మనల్ని దూషించాడు గనుక. ఎందుకు దూషించాడు? తప్పు మనది గనుక.

క్లాసులో అసభ్యంగా ప్రవర్తించటం తప్పు.

అసభ్యతని ఖండించటమూ తప్పేనా?

తప్పుచేసిన మనం, ఒప్పుగా మాట్లాడిన లెక్చరర్ని క్షమాపణకోసం అడగటము....''

''ఎవర్రా తప్పు చేసింది?''

''తప్పుకాదా?...తప్పు కాదా?

పాలిండ్లంటే మనకి అర్థం తెలియనిది ఎవరికి?

కేవలం లెక్చరర్ని ఇబ్బంది పెట్టటానికి....ఆడపిల్లల్ని ఏడిపించటానిక్కాకపోతే....''

''ఒరే, నువ్వా పాలిండ్లని వొదిలిపెట్టరా బాబూ! అస్తమానూ వాటినిపట్టుకు వ్రేలాడతా వెందుకు? ఆ రోజులు ముందున్నాయి గానీ, ఇప్పుడు లెక్చరర్, మననెందుకు నోటికొచ్చినట్టు వాగేడో అది చెప్పు....''

''వాడు చెప్పేదేమిటా? ఇష్టం లేకపోతే, ఇంటికి నడవమంది. అంతేగాని వాడిమాట లెవడిక్కావాలి?''

''ఇలా మనలో వరకే వ్యతిరేకించే వెధవ లుండబట్టే, మన యూనిటీ ఇలా తగలడింది!''

''సమ్మెలంటే భయం, విప్లవమంటే దడ! ఇలాంటి చవటలవల్లే విప్లవాలు ఆరిపోయి, ప్రగతి కుంటుపడేది!''

''విప్లవం....ప్రగతి! ఏది విప్లవం? ఏది ప్రగతి?''

''ఒరే. నీ నిర్వచనాలు మా కక్కర్లేదుగానీ, నీకిష్టం లేకపోతే ముసుగేసుకు కొంపకి పో! మా కడ్డురాకు-గో అవే!''

సూర్యం దిగిపోయాడు. నేను బలవంతంగా వాడిని ఇవతలకు లాక్కుపోయాను.

''వూరుకోరా! నీ కెందుకు వాళ్ళతో గొడవ?''

''అన్యాయంగా సమ్మెచేసి, దేవుడులాటి మాష్టార్ని అవమానించి....''

''నీకు దేవుడు! వాళ్ళకి కాదు.''

''ఇంకాసేపిలాగే వాదిస్తే, మనకి బడితె పూజ జరుగుతుంది. పదరా పోదాం! ఎందుకు అనవసరంగా రౌడీస్టూడెంట్స్‌తో గొడవ?''

''నీకు తెలీదురా! అన్యాయాన్నిలాగే సాగనిస్తే....''

''అదే వాళ్ళనేదీనూ! అన్యాయం అంతం కావాలనే....''

''కానీ, వాళ్ళదృష్టిలో అన్యాయం...''

''ఎవరిదృష్టి వాళ్ళది. నువ్విప్పుడా మహత్తర శక్తిని ఆపలేవు! అనవసరంగా యత్నిస్తే....''

''అదేరా నా బాధ! ఇంత శక్తీ ఇలాటి తుచ్ఛ ప్రయత్నాలకి వృధా అయ్యే బదులు-సమాజోపయోగకర కార్యాలకి వినియోగిస్తే దేశం బాగుపడదూ?''

''సూర్యం. నువ్విలాగే వాగుతూ వుండు. తన్నులు తిందూగాని! నే వెళ్తున్నా!''

చచ్చినట్లు నా వెనకే కదిలాడు సూర్యం.

అయిదురోజులు నగరంలోని అన్ని కాలేజీలూ, హైస్కూళ్ళూ తీవ్రంగా సమ్మె సాగించేక, ఓ దుర్ముహూర్తాన తెలుగు లెక్చరర్ బలవంతాన క్షమాపణ చెప్పుకోక తప్పలేదు!

''ఎందుకు సార్, మీరలా లీడర్స్‌తో తగువు పడతారు? వాళ్ళేదో వాగుతుంటారు. మనం చూసీ చూడనట్టు పోవాలిగానీ, ఇలా మనం మనుగడకే ముప్పుతెచ్చుకుంటామా?''

తోటి లెక్చరర్స్ గూడా ఆయననే సన్నసన్నగా మందలిస్తూ, బుద్ధి చెప్పారని తెలిసింది!

విజయగర్వంతో ఉత్సవాలు జరుపుకున్నారు విద్యార్థులు!

* * *

''వుయ్‌వాంట్—సెపరేషన్!''

''ప్రత్యేకాంధ్రా....కావాలి!''

''రాష్ట్రసాధనే....మన కర్తవ్యం!''

నినాదాలతో దిగారు లారీలోంచి జనం!

బిలబిల లాడుతూ బయటికి వచ్చేశారు క్లాసులలోంచి విద్యార్థులు.

''ప్రత్యేకాంధ్ర—సాధిస్తాం!''

''సుబ్బారెడ్డి—జిందాబాద్!''

''వీరకాకాని....జిందాబాద్!''

''ప్రత్యేక రాష్ట్రం .... మా జన్మ హక్కు.''

''రాష్ట్రం సాధించేవరకూ మనం విశ్రమించరాదు!''

''ఉభయ ప్రాంతాలూ వాంఛిస్తున్న రాష్ట్ర విభజన జరిగితీరాలి!''

అందరూ అందుకున్నారు.

''రాష్ట్రం సాధించేవరకూ ఉద్యోగులు, విద్యార్థులు, పౌరులు అందరూ ఒక్కటి కావాలి!''

కళాశాలలు, కర్మాగారాలు, ఆసుపత్రులు, ఆఫీసులు అన్నీ బంద్! అన్నీ ఖాళీ!

మా కళాశాలా బందయింది.

బయట బ్రహ్మాండంగా మీటింగ్ పెట్టారు.

''సోదరులారా, కళ్ళు తెరవండి. జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించండి! ప్రత్యేకాంధ్రకోసం పరిశ్రమించండి.''

దంచేస్తున్నాడు ఉద్రేకంగా మా స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీ.

సూర్యం లేచాడు.

''తొందరపాటు తగదు ఫ్రెండ్స్! నిదానంగా యోచించండి.

ఈ ఉద్యమం మనదికాదు—మనకి కాదు.

రాష్ట్రం ముక్కలైనంత మాత్రాన మనకి ఒరిగేది లేదు. ఏకత్వంలో వున్న ఐక్యత భిన్నత్వంలో లేదుగాక లేదు!

మనకి కావల్సింది ప్రత్యేక రాష్ట్రం కాదు—ప్రతివాడికీ సమానత్వం. ప్రతి మనిషికీ తిండి, గుడ్డ, జీవనోపాధి కావాలి! అదే మన వాంఛితం, ధ్యేయం కావాలి! అందుకే మనం పోరాడదాం.

అంతేతప్ప, యీ అన్యాపదేశమైన ఉద్యమం. హింసామార్గం మనకివద్దు!

ఇది నాయకులు ఆడుతున్న ఆట! పదవులకోసం-ప్రత్యేకరాష్ట్రం ప్రజలకోసం కాదు.

ఎందరు మంత్రులున్నా, ఎన్ని రాష్ట్రాలున్నా మనకి క్రొత్త ఉపాధులు కలగవు. క్రొత్త జీవనం కలగదు.

వనరులు పెరగాలి. పరిశ్రమలు పెరగాలి. ఉత్పత్తి పెరగాలి. చైతన్యం పెరగాలి!

అదే మనకి కావాలి! అవినీతి అంతం కావాలి!

మనం విప్లవించి, మరో రాష్ట్రం సాధించినా. మనకి యీ సంవత్సరకాలం తిరిగిరాదు — ఉద్యోగాల పెరగబోవు! అందుకే, మనకి వేరు రాష్ట్రమూవద్దు— విభజనా మార్గమూ వద్దు!

రాష్ట్రం వేరైతే, ఆ నాయకులే యీ చిన్న రాష్ట్రాన్ని చింత కుంటా పంచు కుంటారు. మనకి మిగిలేవి శుష్క ప్రియాలే! శూన్య హస్తాలే తప్పదు.

మన లక్ష్యం సమ సమాజమే గానీ, విడి సమాజం కాదు. అఖండమైన అభ్యుదయమే గానీ, ఖండమైన సంకుచితత్వం కాదు."

"రేయ్, సూరిగాణ్ణి తన్నండ్రా!"

"దొంగ రాస్కెల్. ఉద్యమాన్నే వెక్కిరించి, వెన్నుపోటు పొడుస్తావురా!"

"సంకుచితత్వ మేమిటి? నీకేం తెల్సురా ప్రత్యేక రాష్ట్ర ప్రయోజనం?"

"ఎన్ని సిఆర్.పి.లు వచ్చినా, ఎన్ని చావుదెబ్బలు తగిలినా మన ఉద్యమం ఆగదురా! ఏదేమైనా మనం రాష్ట్రం సాధించి తీరతాం!"

"మనకోసం మనవాళ్ళే విసర్జించి, ప్రాణాలే పణం ఒడ్డి, ముందుకురికిన మన నాయకుల్నే కాదంటావా? అమరజీవి పొట్టి శ్రీరాములు వారసులురా వాళ్ళు!"

"నీకు తెలియకపోతే మూలనుండక, మా మధ్యకి వచ్చి వాగేటమ్మ నీ కెవ డిచ్చాడ్రా"

"ఉద్యమ మంటే, విప్లవ మంటే, రక్త పాతమంటే జడిసే పిరికిపందవి- ముసు గేసుకు మూల కూర్చోక- వచ్చి నిన్ను నలుగురిలోకీ రమ్మన్నాడు—"

బలవంతాన వెనక్కి తగ్గుకి నెట్ట బడ్డాడు సూర్యం.

వెల్లువ సాగిపోయింది.

రాష్ట్రమంతా ఉడికి పోయింది. రైళ్లు బంద్-బస్సులు బంద్—ప్రజా సౌకర్యా లన్నీ బంద్! ప్రజా జీవిత మే స్తంభించి పోయింది.

కానీ వర్గ విభేదం లేకుండా లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, లెక్చరర్లు - ప్రజలందరి లోనూ వింత చైతన్యం!

అందరూ అరుస్తున్నా - అరిపిస్తు న్నారు - మూలనున్న వాళ్ళని వెలికి లాగు తున్నారు-వెలుపలున్న వాళ్లని పైకి నెడు తున్నారు.


సూర్యం లాంటి వాళ్లు వెనకే నిలబడి పోయారు.

ఉద్రేకం-ఉత్సాహం! ఎక్కడ చూసినా ఉద్యమ గుడారాలు-నిరసన వ్రతాలు-నిరా హార దీక్షలు! ఆత్మాహుతి బెదిరింపులు!

చిట్ట చివరికి- ప్రభుత్వం బెదిరి- లొంగి పోలేదు. బెదిరించి లొంగదీసింది! ఉద్యమం ఆగిపోయింది! చప్పగా చల్లారిపోయింది!

నడిపిన నాయికులకి తగిన లాభమూ కలిగింది. తిరిగి పదవులు లభించాయి.

నడిచిన ప్రజ నష్టానికి ఆహుతై పోయింది. నష్టపోయిన ప్రాణాల వెనుక



నున్న జీవాల వ్యధ వారితోనే మిగిలి పోయింది!

ముందు నడిచిన విద్యార్థులకి సంవత్సర కాలం వెనుకబడి పోయింది తప్ప-ఉప యోగం శూన్యమైంది.

సూర్యంలాటి వారి మాటకి ఆ నాడు విలువ పడ్డిగవ్వే అయ్యింది గానీ-ఆమాటే చివరికి నెగ్గక తప్పింది కాదు.

*   *   *

"ప్రభుత్వం వైఖరి ... మారాలి!"

"ఉద్యోగుల జీతాలు .... పెరగాలి!"

"అధిక ధరలు .... తగ్గాలి!"

"జీవన వ్యయం .... తగ్గాలి!"

జీతాల పెంపుకై సమ్మె. అఖిల రాష్ట్రో ద్యోగుల సమ్మె.

"సోదర పౌరులారా, సహకరించండి. ధరల పెరుగుదలను అరికట్టటంలో తోడు పడండి!

విద్యార్థి సోదరులారా! సానుభూతి చూపండి! ఇది మా ఒక్కరి సమస్య కాదు. రేపటి ఉద్యోగులైన మీ సమస్య కూడా!"

కాలేజీలలో కలకలం.

"డియర్ ఫ్రెండ్స్, బయటికి నడ వండి. సహపౌరులైన ఉద్యోగులకి సాను భూతి చూపండి. జీవన భారం తగ్గేందుకు ఉద్యమించండి. డౌన్ విత్.. ప్రైస్ రైజ్."

కార్యాలయాలూ, కళాశాలలూ ఖాళీ!

నగరమంతా సమ్మె. హర్తాల్, బంద్!

ఎక్కడ చూసినా జండాలు - ప్రదర్శనలు- సమావేశాలు-నినాదాలు!

మా కళాశాలా సమ్మెలో పాల్గొంది.

సానుభూతి సమ్మె!

"ఇది కాదు మార్గం.

జీవన భారం తగ్గాలంటే మార్గం- జీతాలు పెరగటం కాదు- అధిక ధరలు తగ్గాలి.

నిరుద్యోగుల సంఖ్య ఉద్యోగుల సంఖ్యని విపరీతంగా పరిహసిస్తున్న సమ యంలో-ఉద్యోగస్తులకే యింకా జీతాలు పెరగాలనటం అక్రమం.

"నిరుద్యోగులకి ఉద్యోగాలు దొరకాలి తప్ప- ఉన్న ఉద్యోగాలకే యింకా జీతాలు పెరగటం-అసమంజసం!

దానివల్ల ధరలు మరింత పెరగక తప్పదు.

అప్పుడు నష్టపడేది. యీ నాడు సాను భూతి చూపుతున్న యీ పౌరులే!

ధరలు తగ్గించగల్గితే, జీతాలు పెర



# సారీ సార్!

శ్రీమతి ద్వాదశి దుర్గ

తెలుగు భాషలోకి అనుకోకుండా వచ్చిచేరిన ఇతర భాషాపదాలు చాలా వున్నాయి. వాటిలో మనం నిత్యం వ్యవహారంలో వింటున్న, వాడుతున్న ఈ 'సారీ' అన్న పదం ఒకటి. సారీ మాటని వాడనివారెవ్వరైనావున్నారంటే వాళ్లు మూగవాళ్లన్నా అయ్యుండాలి లేదా మాటలురాని పసిపిల్లలయినా అయ్యుండాలి. అంతగా వ్యాప్తి చెందిందీ పదం.

హడావిడిలో ఎవరికాలన్నా తొక్కినా, చేతిలోని పెట్టె వగైరాలు ఎవరికన్నా తగిలినా వెంటనే సారీ అనేస్తాం. అవతలి వ్యక్తి కూడా సారీ బాపతే అయితే ఫరవాలేదు. అవతలి వ్యక్తి నిరక్షరాస్యుడుగానీ, పూర్వకాలపు పసలమ్మగానీ అయితే "ఏంటే సారీ గీరీ అంటావ్ కాలునొప్పి పెట్టి చస్తూంటే" అని సారీకున్న విలువ కాస్తా తీసేస్తారు. ఈ సారీలు అసలు తెలుగు వారికి సహజం కాదు, మనం బాధని మనసులో పడతాం. సానుభూతితో చూస్తాం. కొందరు కాళ్ళని అడ్డుకుంటారు. ఇవే మనకి సహజాలు. మనసులో లేకపోయినా పైకి 'సారీ' అని చెయ్యటం ఈ మధ్యే అలవాటయింది. 'తప్పయింది' అని తెలుగులో చెప్పలేం. 'ఎక్స్క్యూజ్‌మి' అని ఆంగ్లంలో ఎన్నిసార్లయినా అనగలం. ఈ సారీల రకాలు చూడండి.

'సారీ నాన్నా! ఈ సారి బాగా చదువుతాను' - పరీక్ష తప్పిన విద్యార్థి.

'సారీ అండీ' - ఉప్పు ఎక్కువయిందే అన్న భర్తతో భార్య.

'అత్తయ్యగారూ సారీ అండీ! వత్తులు చెయ్యటం మర్చేపోయాను.'

కోడలు అత్తగారితో.

ఈ 'సారీ' పదంవల్ల సూటిగా చెప్పలేని భావాల్ని వ్యంగ్యంగా చెప్పగలం. పెళ్లిచూపుల్లో ఆ అబ్బాయి నాకు నచ్చలేదని చెప్పడం అమ్మాయికి భయం. 'ఏమంటావ్?' అని అడిగిన తండ్రికి 'సారీ నాన్నా' అని చెప్పటం సులభం. ఈ ఒక్క 'సారీ' పదంతో తన మనోభావాన్ని స్పష్టంగా చెప్పగలగటం జరిగింది. కొన్నిచోట్ల సారీపదం కోపాన్ని తెప్పిస్తుంది. తెల్లటి డ్రెస్ వేసుకొని హోటల్‌కెళ్ళిన వ్యక్తిమీద సర్వర్ చట్నీ పోసి (పొరపాటునే అనుకోండి) 'సారీ' అంటే వాడికి నాలుక్కొట్టి సారీ అనాల్సి వస్తుంది. ఇది రాసి ఫ్రెండ్‌కి చూపిస్తే పత్రికలవాళ్లు తిప్పి పంపించి 'సారీ!' అంటారేమో అంది. నేనంతటి తెలివి తక్కువ దాన్ని కాదు. 'తిరుగు బిళ్ళలు పెట్టలేదు' అని జవాబిచ్చాను. మిమ్మల్ని ఇప్పటికే బాధపెట్టాను. సారీ!

---

గాల్సిన అవసరమే వుండదు! అందుకు అవసరమైన మార్గం మనం యోచించాలి.

బ్లాక్ మార్కెటీర్లను పట్టి బయట పెట్టాలి.

పెరుగుతున్న ఉత్పత్తి అంతా ఏమై పోతోంది? దాన్ని వెలికి లాగి సక్రమమైన పంపిణీ జరిపిన నాడు యింత జీవన వ్యవధా వుండదు. యీ కరువూ వుండదు.

అన్నపూర్ణలాటి మన రాష్ట్రంలోనే ధాన్యం ధర ఎందుకంతగా పెరిగింది?

నేల దిగువ గోడౌన్లలో, పుచ్చి పురుగులుపడుతున్న ధాన్యపురాసుల్ని బయటకు తీసి, ప్రజల్లోకి తెచ్చే మార్గం చూడాలి.

పసిపాపల పాలడబ్బాలు సైతం కొన్ని రెట్లుగా ధరలు పెంచుకు ఎందుకు గగన మండలానికి చేరుతున్నాయి? వాటిని క్రిందకి దించి, సక్రమధరలకు పంపిణీ చేయండి.

అందుకు మనం పరిశ్రమించాలి తప్ప. యీ అనవసరమైన, అర్థరహితమైన సమ్మెల్ని ప్రోత్సహించటానిక్కాదు.''

అంటాడు సూర్యం.

''సూర్యం లాంటి అభివృద్ధి నిరోధకులు నశించాలి!''

''చేతనైన పని చెయ్యలేక, చెయ్యలేని గాలి కబుర్లు చెప్పే సూర్యంలాటి భీరువుల్ని నిరోధించాలి!''

''సూర్యం డౌన్ డౌన్!''

ఆ నాడు బయటే కాక, యింట తండ్రి దగ్గరా సూర్యానికి జరిగే పూజా సదృశ సత్కారమే జరిగిందని తెల్సి చాలా బాధ పడ్డాను తప్ప మరేం చేయలేకపోయాను.

* * *

ఇది జరిగిన పది రోజులకే వెలువడింది గజకర్ణంగారి అరెస్టు వార్త.

తూరుపు తెలవారక ముందే ఆయన్ని అరెస్టుచేసి, తీసుకుపోయారు. లేక, ఆయన్ని అరెస్టుచేసి తీసుకుపోయారు గనకే తూరుపు తెల్లబడిందో!

కాలేజీకి రాలేదు అవాళ సూర్యం. వాడిని కంగ్రాచ్యులేట్ చెయ్యటమో, ఓదార్చటమో తెలియక ఎదురుచూస్తున్న వాళ్లంతా డిసప్పాయింటయ్యారు.

''తండ్రిని అరెస్టుచేశారని బాధతో రాలేదేమో!''

''వాడికి బాధెందుకు? వాడే అనుపానులన్నీ రిపోర్టిచ్చి, పట్టించాట్ట!''

''అయినా అంత తెగింపెలా కలిగిందిరా వాడికి?''

''అదే ఆశ్చర్యం! అన్యాయం చేస్తున్నా, తండ్రిని పట్టించాలంటే, స్వార్థరాహిత్యం, త్యాగశీలం, ధైర్యం, సాహసం చాలా కావాలే!''

"మరే! వీడు చూస్తేనేమో, పిరికి పంద! ఉద్యమాలన్నా, విప్లవాలన్నా భయపడి పారిపోతాడు!"

"యూ ఫెలోస్, షటప్ ఐసే!" ఒళ్లు మండిపోయి, అన్నాన్నేను. "మీకేం తెలుసు సూర్యం గురించి: అలాటి అరుదైన వ్యక్తుల గురించి?

అసలు మీకు విప్లవమంటే తెలుసా? త్యాగమంటే తెలుసా?

ఏం తెలుసు?

మనం సమ్మెలు చేసేది న్యాయసమ్మతమైన ప్రయోజనాలకోసమేనా? కానేకాదు.

నిజం నిర్భయంగా చెప్పాలంటే, కాలేజీకి శెలవు దొరికితే, మనకి ఆటవిడుపు దొరుకుతుందని! ఎన్నిరకాలుగా వీలయితే, అన్ని రకాలుగా క్లాసులు ఎగ్గొట్టవచ్చుని!

దానికి మనం పూసే రంగు పూత ఉద్యమం!

మనం ఉద్యోగస్థులకీ నాయకులకీ సమ్మెల్లో సహకరించేది ఎందుకోసం? సానుభూతితోనేనా?

కానే కాదు.

వాళ్లు మన యూనియన్‌కీ, లీడర్లకీ యిచ్చే డబ్బుకోసం! మనం రికీ పోయించే కాఫీల కోసం?

మళ్లీ ముఖ్యంగా చదువు ఎగ్గొట్టటం కోసం!

ఇవన్నీ ఎత్తి చూపి ఖండిస్తారని సూర్యంలాటి వారిమీదకోపం, ద్వేషం-కసి!


ఇంక్విలాబ్ - జిందాబాద్! ఇంక్విలాబ్ అంటే ఏమిటి? ప్రభుత్వంలో అవినీతి పోవాలి! ప్రభుత్వమంటే ఎవరు?

అధికారులు తగ్గాలి. అందుకు మనం ఎంతవరకు సహకరిస్తున్నాం?

చంద్రం వాళ్ల నాన్న, ... కొల్లో వాడుతున్న ... ఎలాటివి?

మరి కల్తీని ప్రోత్సహిస్తూ, ... పెంచేస్తున్న తండ్రిని ... ఆహ్వానించే విద్యార్థి ... చంద్రం చూపుతున్న వ్యతిరేకత ఏది?

నరసిరాజు వాళ్ళనాన్న రేషన్‌కార్డు మీద తెచ్చుకునే పది కిలోల పంచదారా, పది కిలోల గోధుమల్లో, కటి, రెండు కిలోలు తమకోసం వాడుకుని మిగతా దంతా-నల్లధరకి బజార్లో అమ్ముస్తాడు!




ధలూ. అవినీతి తగ్గాలని నినదించే నర్సిరాజు, అది చూస్తూ ఏం చేస్తున్నాడు?

ఇంకా మనందరి కళ్ళెదుటా మనం ఇచ్ఛాపూర్వకంగా చూస్తుండగానే ఇంకా ఎన్ని ఘోరాలు జరిగిపోవట్లేదు? ఎవరం పట్టించుకోగల్గుతున్నాం? అసలు పట్టించుకోవాలనుకొంటున్నాం?

అవినీతి వద్దన్నాడు కాబట్టి సూర్యం అసమర్థుడు. అనవసరపు సమ్మెల్ని నిరసించాడుగనుక సూర్యం పిరికివాడు. సానుభూతి సమ్మెలు అనవసరమన్నాడు కాబట్టి సూర్యం విప్లవ వ్యతిరేకి!

కాని, కానీ....ఇవాళ చూడండిరా! మనకంటె, మనందరికంటె వాడెంత ముందున్నాడో!

తండ్రిచేస్తున్న నల్లవ్యాపారం, ఘోరకల్తీ అతడికి ఎన్నాళ్లుగానో తెలుసు! అదనుకోసం కామ్‌గా ఎదురు చూస్తున్నాడు సమయం దొరకగానే పట్టిచ్చేశాడు - దాక్షిణ్యంగా!

అవినీతిని పట్టిచ్చాడు - అది కన్నతండ్రే అయినా! నల్లసరుకుని బయటికి లాగాడు అది స్వంత ఉపాధే అయినా!

అదిరా విప్లవమంటే! అదిరా ఆదర్శమంటే!

ఈనాటి విద్యార్థులం-రేపటి పౌరులం-మనకి ఆదర్శం అలాటి విప్లవమేరా! విప్లవమంటే కేవలం రక్తపాతమేకాదురా! సూర్యం నేడు చేసిన, చూపినదే విప్లవమార్గం మనకదే ఆచరణీయం!"

పెదాలు మాడ్చుకు నా వైపే చూస్తున్నాడు చంద్రం మొదలుకొని విద్యార్థులంతా!

ఆ మూడులోంచే తేజస్సు ఉద్భవిస్తుందనీ, కొత్త వెలుగు ప్రతిఫలిస్తుందనీ నాకు తోచింది!

★★★

అరాచకం రాజుతూ
అసహనం రగులుతున్న
ఈ మసక వెన్నెలరాత్రిలో
వెన్నెల వేయి కీలలు రేపినపుడు
తారకలు నిప్పురవ్వలై రేగినపుడు
అవి ఎండుగుండెల్లో రాలినపుడు
గడ్డిపువ్వుల్లో నవ్వినపుడు
ఆ నవ్వులు ఈ చీకటిలో
వెలుగై ప్రసరించినపుడు
ఈ చీకటే
అశాంతికి అవధి
అవినీతికి పరిధి
ఈ రాత్రి తుదిగడియలో
రేపటి తొలి సంజకెంజీయలో
చైతన్యం స్రవిస్తుంది
కొత్త వెలుగు ప్రసవిస్తుంది
బానిసత్వంలో అణగారి
నిరాశలో విసిగి
నిట్టూర్పులతో వడలిన
గడ్డిమొక్కలు
రవికిరణం సోకగానే
కొత్త చివుళ్ళు వేస్తాయి
భవితవ్యం గుర్తిస్తాయి
ప్రగతివైపు చలిస్తాయి.

★★★